www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శుక్ర వారం, 16 డిసెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృద్విరాజు | సంపుటి - 07, సంచిక-211 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## లాడెన్‌కు ఆశ్రయమిచ్చే వారికి మాట్లాడే హక్కు లేదు



ఉగ్రవాదంపై పాక్ తీరును మరోమారు ఎండగట్టిన భారత్

ఐక్యరాజ్య సమితి వేదికగా పాక్‌పై జై శంకర్ తీవ్ర వ్యాఖ్యలు

ఐక్యరాజ్య సమితి కార్యాలయం ముందు గాంధీ విగ్రహావిష్కరణ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 15 (సమ సమాజం):** అంతర్జాతీయ వేదిక ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో దాయాది పాక్ తీరును భారత్ మరోసారి ఎండగట్టింది. భారత్ పట్ల పాక్, చైనా తీరుపై విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ జై శంకర్ ఆగ్రహం 3వ

## 26నుంచి రాష్ట్రపతి దక్షిణాది విడిది



బొల్లారంలో ఐదురోజుల పాటు బస

ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

28న భద్రాచలం, ములుగు సందర్శన

**హైదరాబాద్, డిసెంబర్ 15 (సమ సమాజం):** భారతదేశ ప్రథమ పౌరురాలు.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దక్షిణాది విడిది ఖారరాయ్యింది. ఆమె ఈ నెల 26న సికింద్రాబాద్ బొల్లారం విడిదికి రానున్నారు. శీతాకాల విడిదిలో భాగంగా ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు ఆమె బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేయను న్నారు. దీంతో బొల్లారంలో పూర్తిస్తాయి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడినుంచే ఆమె వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందులో భాగంగా ఈ నెల 28 న భద్రాచలం రానున్నారు. రామయ్య దర్శనం చేసుకున్న తర్వాత ప్రసాద్ పథకాన్ని రాష్ట్రపతి ముర్ము ప్రారంభించ నున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ కార్యక్రమాలతో రాష్ట్రపతి బిజీగా గడప నున్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా ఆమె భద్రాచలం చేరుకుంటారు. శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకుంటారు. ఆలయ మాడవీధి నుంచి వీఐపీ మార్గంలో వాహనాల రాకపోకలు ఇబ్బంది లేకుండా మెట్లను తొలగించాలని నిర్ణయించారు. అయితే.. 23 నుంచి ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు జరగనున్నాయి. 1965 జులై 13న అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ గోదావరి వంతెన జాతికి అంకితమైంది. ఆ తర్వాత కాలంలో రాష్ట్రపతి రావడం ఇది రెండోసారి. నెల 28న ఉదయం భద్రాచలం ఆలయాన్ని 3వ

## బిఆర్ఎస్‌కు విఆర్ఎస్ తప్పదు

- తెలంగాణలో కెసిఆర్ పాలనకు ఇక చరమగీతం
- తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టారు
- కరీంనగర్ సభలో జెపి నడ్డా విమర్శలు
- కరీంనగర్ ఇచ్చిన ధైర్యమే ఈ యాత్ర
- ఈ గడ్డ ఇచ్చిన అండతోనే కాషాయ జెండా ఎగురేస్తున్నా
- మీరిచ్చిన ప్రోత్సాహంతోనే ముందుకు సాగుతున్నా
- కరీంనగర్ సభలో ఉద్వేగపూరిత ప్రసంగంలో బండి
- ముగిసిన బండి సంజయ్ పాదయాత్ర
- కరీంనగర్ సభకు భారీగా హాజరైన జనం
- ముఖ్య అతిథిగా వచ్చి జెపినడ్డా, ప్రముఖులు



**కరీంనగర్, డిసెంబర్ 15 (సమ సమాజం):** కరీంనగర్ గడ్డ తనకెంతో ఇచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. మీరిచ్చిన ఈ అండంతోనే నేను కాషాజెండా ఎత్తానని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా కాషాయ జెండాను ఎగురేయడమే లక్ష్యమని, భారతమాత అనిపించడమే కర్తవ్యమని అన్నారు. హిందూ ధర్మ రక్షణ కోసం నిరంతరం పనిచేస్తానని తెలిపారు. మీరు ఇచ్చిన స్ఫూర్తితోనే నేను ఢిల్లీ గడ్డపై అడుగు పెట్టానని అన్నారు. కరీంనగర్‌లో జరుగుతున్న ప్రజాసంగ్రామయాత్ర ముగింపుసభలో ఆయన భావోద్వేగంగా మాట్లాడారు. 2018లో జరిగిన అసెంబ్లీ 3వ

## నకిలీ సర్టిఫికెట్ల ముఠా అరెస్ట్

13 యూనివర్సిటీలకు చెందిన 140 నకిలీ సర్టిఫికెట్ల సృష్టి

నలుగురు ముఠా సభ్యుల అరెస్ట్



**హైదరాబాద్, డిసెంబర్ 15 (సమ సమాజం):** అంతర్ రాష్ట్ర నకిలీ సర్టిఫికెట్ తయారీ ముఠాను బషీర్ బాగ్ సౌత్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. దాదాపు 13 యూనివర్సిటీలకు చెందిన 140 నకిలీ సర్టిఫికెట్లను సృష్టించారని సెంట్రల్ జోన్ డీసీపీ రాజేష్ చంద్ర తెలిపారు. ఇప్పటికి 30 మందికి ఈ సర్టిఫికేట్లను అందించారని గుర్తించామన్నారు. నకిలీ సర్టిఫికెట్స్ దందా చెలామణి 3వ

## రాజును కాపాడిన రెస్క్యూ టీమ్





వెంటనే అంబులెన్సులో ఆస్పత్రికి తరలింపు

రాజు బయటపడడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

బయటకు తీసేందుకు రెస్క్యూ సిబ్బంది సాహసం

**కామారెడ్డి, డిసెంబర్ 15 (సమ సమాజం):** ఎట్టకేలకు బండరాళ్ల మధ్యచిక్కుకున్నరాజను ప్రాణాలతో బయటకు తీసారు. అత్యంత కఠినం పరిస్థితులను ఎదుర్కొని పోలీసులు,ఇతర అధికారులు గంటలతరబడి శ్రమించి రక్షించారు. అనంతరం అతడిని వెంటనే అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. మొత్తంగా ఈ ఆపరేషన్‌లో అధికారుల కృషి అభినందనీయం. క్షణం ఒక యుగంలా గడిచినా..పట్టుదలతో రెస్క్యూ టీమ్ అదడి ప్రాణాలు కాపాడరు. దీంతో రెస్క్యూ ఆపరేషన్ సక్సెస్ అయ్యింది. కొండరాళ్ల మధ్య ఇరుక్కుపోయిన రాజు ఎట్టకేలకు బయటకు వచ్చాడు. పోలీస్, రెవెన్యూ, ఫారెస్ట్, ఫైర్ శాఖల సమన్వయం సక్సెస్ అయ్యింది. 3వ

## నేడు ప్రధాని మోడీతో భేటీకానున్న ఎంపి కోమటిరెడ్డి

పలు సమస్యలను దృష్టికి తీసుకుని వచ్చేలా ప్రణాళిక



**న్యూఢిల్లీ, డిసెంబర్ 15 (సమ సమాజం):** ప్రధాని మోడీతో భువనగిరి ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుక్రవారం భేటీ కానున్నారు. ప్రధాని మోడీతో మీటింగ్‌కు అపాయింట్‌మెంట్ ఖరారైంది. 16న ఉదయం 11 గంటలకు ప్రధాని కార్యాలయానికి రావాలని పీఎంవో నుంచి సమాచారం అందినట్లు తెలుస్తోంది. అభివృద్ధి పనులపై చర్చించేందుకు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మోడీ అపాయింట్‌మెంట్ కోరారు. భేటీ సందర్భంగా వెంకట్ రెడ్డి కీలక అంశాలను ప్రధాని దృష్టికి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. కాలుష్యం కారణంగా నల్గొండలో మూసీ పరివాహక ప్రాంతాలకు ఇబ్బంది కలుగుతోందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రధాని దృష్టికి తీసుకురానున్నట్లు సమాచారం. నమామి గంగే తరహాలో నమామి మూసీ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆయన ప్రధానిని కోరనున్నట్లు తెలుస్తోంది మెట్రో, ఎంఎంటీఎస్‌కు సంబంధించి పలు అంశాలపై ప్రధాని వద్ద ప్రస్తావించే అవకాశముంది. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలపై కూడా వీరి మధ్య చర్చ జరిగే అవకాశం ఉంది. అలాగే... హైదరాబాద్, విజయవాడ హైవే గురించి ప్రధాని దృష్టికి పలు అంశాలను కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీసుకెళ్లనున్నారు.

## ఫామ్‌హౌజ్ కేసులో విచారణ

కెసిఆర్ ఎవిడెన్స్‌ను తీసుకుంటామన్న హైకోర్టు



**హైదరాబాద్, డిసెంబర్ 15 (సమ సమాజం):** టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సీఎం కేసీఆర్ ఇచ్చిన ఎవిడెన్స్‌ను పరిగణలోకి తీసుకుంటామని హైకోర్టు స్పష్టం చేసింది. దీన్ని చూసి తదుపరి విచారణ చేపడతామని పేర్కొంది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసుపై హైకోర్టులో విచారణ జరిగింది. ఫాంహౌస్ కేసు వీడియోలు, ఆడియోలు దర్యాప్తు దశలోనే లీక్ అవ్వడంపై పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. హైప్రొఫైల్ కేసులో దర్యాప్తు మధ్యలోనే ఆధారాలు ఎలా బయటికి వెళ్ళాయని అడిగారు. సిట్ దర్యాప్తు సక్రమంగా లేదని పిటిషనర్లు కోర్టుకు విన్నవించారు. ఈ కేసును లా అండ్ ఆర్డర్ పోలీసులు కాకుండా ఏసీబీతో ఎందుకు విచారణ జరిపించలేదని పిటిషనర్ తరుపున న్యాయవాది వాదించారు. మెట్రోపాలిటన్ నగరాల్లో ఏసీపీ స్థాయి అధికారి పీసీ యాక్ట్ కేసులను విచారించవచ్చని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. అయితే 2003లో ఏసీపీ పరిధిని ఖరారు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని...దాని ప్రకారం 2003 3వ

## స్మార్ట్‌సిటీలో అభివృద్ధి ఏదీ

పార్లమెంటులో గల్లా జయదేవ్ ప్రశ్న

**న్యూఢిల్లీ, డిసెంబర్ 15 (సమ సమాజం):** అమరావతి నిర్మాణంపై పార్లమెంటులో తెలుగు దేశం ఎంపీ గల్లా జయదేవ్ గళం విప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో స్మార్ట్ సిటీలో భాగంగా చేపట్టాల్సిన పనుల సంగతేంటని గల్లా ప్రశ్నించారు. ఒక్క ప్రాజెక్టును కూడా ఎందుకు పూర్తి చేయలేకపోయిందని కేంద్రాన్ని నిలదీశారు. ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోవడానికి సరైన కారణాలు చెప్పలేక కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ తడబడ్డారు. అమరావతిలో మొత్తం 21 ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. రూ.2046 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టులను పూర్తి చేయాలని సంకల్పించినట్లు పేర్కొన్నారు. కేంద్రం వాటాగా రూ.488 కోట్లు కూడా విడుదల చేసిందని వెల్లడించారు. కేంద్రం నిధులిచ్చినా పెద్దగా చెప్పుకునే విధంగా అక్కడ పనులు మాత్రం జరగలేదని మంత్రి స్పష్టం చేశారు. పనులు పూర్తికాకపోవడానికి కారణాలను మాత్రం వివరించలేకపోయారు.



## నవీన్ రెడ్డి కస్టడీని కోరిన పోలీసులు

కోర్టులో కస్టడీపై విచారణ

కస్టడీకి ఇస్తేనే నిజాలు వెలుగు చూస్తాయంటున్నపోలీసులు

**హైదరాబాద్, డిసెంబర్ 15 (సమ సమాజం):** మన్నెగూడ కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడైన నవీన్ రెడ్డి కస్టడీ కోరుతూ ఆదిభట్ల పోలీసులు ఇబ్రహీంపట్నం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నవీన్ రెడ్డిని వారం రోజుల పాటు కస్టడీ కోరుతూ పిటిషన్ వేశారు. ఐదుగురు నిందితులను కస్టడీలోకి ఇవ్వాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. బుధవారం నవీన్ రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. నిందితుడు నవీన్ రెడ్డిని కస్టడీ లోకి తీసుకుంటే మరిన్ని విషయాలు వెలుగు లోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. మన్నెగూడ కిడ్నాప్ కేసు నిందితుడు నవీన్ రెడ్డి కన్ఫెషన్



3వ

## సంపాదకీయం

# విపత్తు సాయం కోసం ప్రత్యేకనిధి ఏర్పరచాలి !

ఇటీవలి వర్ష తుఫాన్లు సామాన్యులను, రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. వారిని కట్టుబట్టలు లేకుండా రోడ్డున పడేస్తున్నాయి. పాలకులు కంటితుడుపు చర్యలతో వారిని మభ్యపెడుతున్నారు. ప్రకృతి వైపరీత్యా లతో సామాన్యలను ఆదుకునే ప్రయత్నాలను పక్కన పెట్టారు. తుపాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకున్నప్పుడు గతంలో మరణాల సంఖ్య భారీగా ఉండేది. పెరిగిన సాంకేతికతతో పాటు అధికార యంత్రాంగం అప్రమత్తత కారణంగా ఇటీవల కాలంలో మరణాల సంఖ్య గణనీయంగా తగ్గింది. నిజానికి కేంద్రమే విపత్తు సహాయనిధిని ఏర్పాటుచేసి ఆదుకునే ప్రయత్నాలు సాగాలి. అలా జరగనంత కాలం దేశం లో సామాన్యులకు సాయం అందదని గుర్తించాలి. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిధిని ఏర్పాటు చేయాలి. అప్పుడే సామాన్య లకు భరోసా దక్కగలదు. రాష్ట్రాలు కష్టాల్లో చిక్కుకున్నప్పుడు స్పందిం చాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే! తక్షణ సాయం ప్రకటించడంతో పాటు, పూర్తిస్థాయి నష్టం అంచనా వేయడానికి బృందాన్ని పంపడం, ఆ బృందం ఇచ్చే నివేదికను, రాష్ట్ర ప్రభుత్వాల విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని మరిన్ని నిధులను మంజూరు చేయడం వంటి పనులు కేంద్ర ప్రభుత్వం సాధారణంగా చేస్తుంది. ఈ తరహా స్పందన ఎంత త్వరగా వ్యక్తమైతే బాధిత ప్రజానీకానికి అంత త్వరగా ఊరడింపు లభిస్తుంది. అయితే, తాజా తుపాన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం నుండి ఇటువంటి స్పందన నామమాత్రంగా కూడా వ్యక్తం కాలేదు. సాయం సంగతి అలా ఉంచి, కనీసం బాధిత ప్రజానీకానికి కేంద్ర ప్రభుత్వం నుండి ఊరడింపు మాటలు కూడా వ్యక్తం కాకపోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. తమ సొంత ప్రభుత్వాలు ఉన్న చోటో, ఎన్నికలు వచ్చినప్పుడో దీనికి భిన్నంగా ఉరుకులు, పరుగుల మీద సాయం అందడం ప్రజానీకం గమనిస్తున్నారని గుర్తించాలి. ఈ తరహా వివక్షా పూరిత వైఖరిని కేంద్ర ప్రభుత్వం తక్షణం మానుకోవాలి.

తీర ప్రాంత ప్రజానీకానికి తుపాన్లు, వాటి వల్ల వచ్చే కష్టాలు కొత్త కాదు. కానీ, ఆ కష్టాలను పూర్తి స్థాయిలో నివారించలేక పోవడమే బాధాకరం. తాజాగా విరుచు కుపడిన మాండూస్ తుపాన్ కూడా తీర ప్రాంత ప్రజా నీకానికి తరగని కష్టాలను మిగిల్చింది. తుపాన్ ప్రాంతానికి పలు జిల్లాల్లో తీవ్రనష్టం వాటిల్లింది. రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధికారికంగా నష్ట తీవ్రతను ఇంకా ప్రకటించలేదు. దీంతో సాయం కోసం అటు రైతులు, ఇటు సామాన్యులు ఎదురు చూస్తున్నారు. ప్రబుత్వాలు కూడా ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన వారికి ఎప్పుడూ సాయం సాధారణంగా జరగాలి. కానీ అల జరగక పోవడం సరిరాదు. దేశంలో ప్రజలు దీనిని గట్టిగానే ప్రశ్నించాలి.ఎన్యూమరేషన్ ఇంకా ప్రారంభమే కాకపోవడంతో ఈ పక్రియ పూర్తయి, బాధితులకు నష్టపరిహారం అందడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది. ఆలోగా అరకొర సాయం తోనే బాధితులు నెట్టుకురావాల్సి ఉంటుంది. మాండూస్ తుపాన్ సమయంలోనూ ఈ విషయాన్ని గమనించ వచ్చు. మూడు, నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసినప్పటికీ, దక్షిణ కోస్తా జిల్లాలో నదులు, వాగులు పొంగి ప్రవహించినప్పటికీ మానవనష్టం పెద్దగా లేదు. ఇకపోతే సకాలంలో సహాయ చర్యలు చేపట్టినందున మరణాల సంఖ్యను నలుగురికి పరిమితం చేయగలిగామని తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఇటు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళ నాడులోనూ సంభవించిన ఆస్తి, పంట నష్టం మాత్రం అపారం. రైతులు పంటలు నష్టపోయారు. గతంలోనూ గోదావరికి పెద్ద ఎత్తున వరదలు రావడంతో ఇప్పటికీ కోలుకోలేదు. మాండూస్ తుపాన్ కారణంగా చిత్తూరు, తిరుపతి, కర్నూలు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, కృష్ణ, ఉభయ గోదావరి జిల్లాల్లో లక్షలాది ఎకరాల పంట దెబ్బతింది. రేపో, మాపో మార్కెట్‌కు చేరాల్సిన ధాన్యపు కళ్ళాల్లోకి వర్షపు నీరు చేరింది. పండ్ల తోటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. వరద నీరు చేరడంతో కొన్ని చోట్ల ఇళ్లకు దెబ్బతిన్నాయి. వీరందరినీ ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. కేంద్రం కూడా ఎప్పటికప్పుడు ఆరా తీసి ముందుకు సాగాలి. అది జరగాలంటే ముందుగా ఎన్యూమ రేషన్ పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. నష్టం అంచనాల పక్రియను వెంటనే ప్రారంభించి, వారం రోజుల్లోపు సాయం అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల పక్రియను ఉదారంగా నిర్వహించాలి. రంగుమారినా, తడిసినా ముందుగా ప్రకటించిన రేటుకే కొనుగోలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి కూడా ఇదే విధమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కావాలి. దీంతో పాటు అన్ని విధాల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికి అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకోవాలి. అప్పుడే రైతులకు కొంతమేరకైనా ఊరట లభిస్తుంది. అదే సమయంలో రాష్ట్రాల్లోని అధికార పక్షంతో పాటు, ప్రధాన ప్రతిపక్షం కూడా సాయం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. అవసరమైతే ఇతర ప్రతిపక్షాలను కూడా కలుపుకుని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలి. విపత్తుల సాయం అందేందుకు ముందుకు వచ్చేలా చొరవ తీసుకోవాలి. అన్నదాతలను ఆదుకోకుంటే మనం గట్టెక్కమని గుర్తించాలి. ఇకపోతే 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం 2016 ఖరీఫ్ నుంచి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన,వాతావరణ ఆధారిత పంటలబీమా పథకాన్ని అట్టహాసం గా ప్రారంభించింది. ఈ పథకం అమలు పక్రియలోకి ప్రైవేటు బీమా కంపెనీలను కూడా అనుమతించింది. నిర్దిష్ట మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. కానీ 2019-2020 నాటికే ఈ పథకాలు బలహీనతలను చాటుకున్నాయి. భారీ ప్రీమియం రేట్లతో ప్రైవేటు కంపెనీలను ఆకర్షించిన ఈ పథకాలు 50శాతం రైతులను కూడా బీమా పరిధిలోకి తీసుకురాలేకపోయాయి. రైతుల ప్రీమియం వాటా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రీమియం సబ్సిడీ వాటా మాత్రం వేల కోట్లకు చేరుకుంది. ఫలితంగా బీమా పరిధిలోకి వచ్చిన రైతులకు కలిగిన ప్రయోజనం తక్కువే అయినా, ప్రైవేటు, ప్రభుత్వ రంగ బీమా కంపెనీలు మాత్రం వేల కోట్ల లాభాలను మూట కట్టుకున్నాయి. అలాగ కాకుండా విపత్తుల లేదా పంటనష్టాల విషయంలో సమగ్ర బీమా అందేలా చేయాలి. అప్పుడే అన్నదాతలకు వ్యవసాయంపై మక్కువ పెరుగుతుంది.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

## ఎన్నికలకు ముందే టిఆర్ఎస్ ఖతం

ఇక కాంగ్రెస్‌తో దోస్తీ రాజకీయాలు ● ఎంపి ధర్మపురి అర్వింద్ విమర్శలు



**కరీంనగర్, డిసెంబర్ 15 (సమ సమాజం):** ఎన్నికల కంటే ముందే టీఆర్ఎస్ ఖతమైందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. హామీల అమల్లో కేసీఆర్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. బీజేపీకి, మోడీకి వ్యతిరేకంగా కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని పెట్టారన్నారు. కరీంనగర్‌లో బండి సంజయ్ ఐదో ప్రజా సంగ్రామ యాత్ర ముగింపు సభలో అరవింద్ మాట్లాడారు. బీఆర్ఎస్ కు సిద్ధాంతం, ఎజెండా అంటూ ఏమీ లేదని, కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకునేందుకే బీఆర్ఎస్ ఏర్పాటని ఆరోపించారు. ఈ విషయం కార్యకర్తలకు తెలిసింది కానీ..నాయకులే మేల్కోవాలన్నారు. తెలంగాణలో కేసీఆర్ కాంగ్రెస్‌తో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ సీట్లు, టికెట్లు కూడా కేసీఆరే డిసైడ్ చేస్తారని విమర్శించారు. బీఆర్ఎస్ తో కేసీఆర్... దేశమంతా తిరుగుతూ కేటీఆర్‌కు రాష్ట్రం అప్పగిస్తాడట.. సినీ నటులతో, రాత్రి మ్యూజిక్ లు వినడం తప్ప కేటీఆర్ ప్రజల్లోకి రాడని అరవింద్ అన్నారు. ఇక మొన్నటి దాకా తనని వేటాడి, వెంటాడ ఓడిస్తానన్న కవిత.. ఇప్పుడు తన తండ్రి చెప్పిన చోట పోటీ చేస్తుందట.. కవిత తన మీద పోటీ చేయాలని, దైర్యం లేకపోతే కేసీఆర్ ను ఇందూరు నుంచి పోటీకి దిగామని చెప్పాలని అరవింద్ డిమాండ్ చేశారు. బీజేపీ వస్తేనే అవినీతి రహిత పాలన వస్తుందని, డబుల్ ఇంజన్ సర్కారు లక్ష్యంగా పని చేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు.

## సునీల్ కనునోగులోపై ఎఫ్ఐఆర్ నమోదు

**హైదరాబాద్, డిసెంబర్ 15 (సమ సమాజం):** సునీల్ కనుగోలు కేసులో తెలంగాణ గళం ఫేస్‌బుక్ పేజీపై నవంబర్ 24న ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణ గళం పేరుతో సీఎం కేసీఆర్, కేటీఆర్, కవితను ట్రోల్ చేస్తూ వీడియోలు పెట్టారని తుకారంగేట్‌కు చెందిన సాత్రమాట్ అనే వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. మాయాబజార్ సినిమాలోని ఓ వీడియోలో కేసీఆర్, కేటీఆర్, కవిత ఫేస్‌లను మార్ఫింగ్ చేసి పోస్ట్ చేశారని.. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆ వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సాత్రమాట్ ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ పోలీసులు నవంబర్ 24న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని 41(జీ) నోటీసులు ఇచ్చారు. ఈ నెల 17 న ఉదయం 10:30 కు తమ ఎదుట హాజరుకావాలని ఆ నోటీసుల్లో పోలీసులు స్పష్టం చేశారు.

## స్కూలుకు వెళ్లిన చిన్నారి అదృశ్యంపై ఫిర్యాదు

**మేడ్చల్, డిసెంబర్ 15 (సమ సమాజం):** జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో 10 ఏళ్ల చిన్నారి మిస్సింగ్ కావడం కలకలం రేపింది. 4వ తరగతి చదువుతున్న ఇందు అనే చిన్నారి మిస్ అయింది. ఉదయం పాప తండ్రి దమ్మైగూడలోని ప్రభుత్వ పాఠశాల వద్ద వదిలిపెట్టి వెళ్లగా.. ఆ తర్వాత నుంచి పాప కన్పించలేదని సమాచారం. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు పాప కోసం గాలిస్తున్నారు. పాపను ఎవరైనా కిడ్నాప్ చేశారా లేక స్కూల్ నుంచి ఎటైనా వెళ్లిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. స్కూల్ చుట్టుపక్కల ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పిల్లలకు రక్షణ కరువైందని స్కూల్ సమీపంలో సీసీ కెమెరాలు కూడా లేవని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు

# ఎస్టీలకు రిజర్వేషన్లు కెసిఆర్ చలవే

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ వెల్లడి



**వరంగల్, డిసెంబర్ 15 (సమ సమాజం):** తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోనే ఎస్టీలకు రిజర్వేషన్లు లభించాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. జిల్లాలోని కొడకండ్ల మండలం పెద్దబాయి తండా గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. సంత్ సేవాలాల్ వల్ల ఎస్టీలకు గుర్తింపు, గౌరవం లభించాయని అన్నారు. మున్నెన్నడు జరగని విధంగా ఎనిమిదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అనేక రంగాల్లో అభివృద్ధి సాధించిందని గుర్తు చేశారు. ఉచిత కరెంట్‌ను గిట్టని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోటార్లకు మీటర్లు పెట్టాలని తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తుందని అన్నారు. మీటర్ల వల్ల వ్యవసాయం కుదేలవుతుందని, రైతులు ఆర్థికంగా రోడ్డున పడుతారని పేర్కొన్నారు. అనుక్షణం రైతుల మేలు కోసం ఆలోచించే సీఎం కేసీఆర్ కేంద్ర ప్రతిపాదనను తిరస్కరించారని తెలి పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం ధాన్యం కొను గోలు చేస్తుందని వారికి సకాలంలో ధాన్యం డబ్బులు బ్యాం కుల్లో జమా చేస్తు న్నామని అన్నారు. పాలకుర్తిలో ఎకరం స్థలాన్ని కేటాయించి రూ. రెండు కోట్లతో సేవాలాల్ భవనాన్ని నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, ఆసరా పెన్షన్లు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రద్ధా ఎముకలకు డిఎన్ఎ టెస్ట్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 15 (సమ సమాజం):** సహజీవనం చేస్తున్న శ్రద్ధా వాల్కర్‌ను ఆమె భాయ్‌ఫ్రెండ్ అమీన్ పూనావాలా అత్యంత దారుణంగా చంపిన కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఆమె శరీరాన్ని 35 ముక్కలుగా చేసి .. నగరంలోని వివిధ ప్రాంతాల్లో పడేశాడు. ఆ కిరాతక మర్డర్ గురించి ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తూనే ఉన్నారు. సమీప అడవుల్లో శ్రద్ధా శరీర భాగాలను సేకరించిన పోలీసులు వాటిని డీఎన్ఏ పరీక్ష నిమిత్తం పంపారు. అయితే ఢిల్లీ అడవుల్లో దొరికిన ఎముకలు శ్రద్ధా వాల్కర్‌వే అని డాక్టర్లు తేల్చారు. డీఎన్ఏ పరీక్ష ద్వారా నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది. మెహరౌలీ, గురుగ్రామ్ అడవుల నుంచి ఢిల్లీ పోలీసులు శ్రద్ధా ఎముకల్ని సేకరించారు. అయితే ఆ ఎముకలకు జరిపిన పరీక్షల్లో.. ఆమె తండ్రి డీఎన్ఏతో మ్యాచ్ అయినట్లు గుర్తించారు.

## నీరవ్ మోడీకి లండన్ కోర్టులో చుక్కెదురు

**లండన్, డిసెంబర్ 15 (సమ సమాజం):** పరారీలో ఉన్న భారత వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీకి బ్రిటన్ కోర్టులో చుక్కెదురైంది. మోసం, మనీలాండరింగ్ కేసులో విచారణకు తనను భారత్‌కు అప్పగించాలన్న నిర్ణయంపై సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు అనుమతించాలన్న నీవర్ మోడీ పిటిషన్‌ను గురువారం అక్కడి కోర్టు తిరస్కరించింది. 2018లో పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ మోసానికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో నీరవ్ మోడీ భారత్ నుండి పారిపోయిన సంగతి తెలిసిందే. తనను భారత్ కు రప్పిస్తే ఆత్మహత్య చేసుకునే ప్రమాదం ఉందని మోడీ తరపు న్యాయవాదులు వాదించినట్లు రాయిటర్స్ తెలిపింది.

## ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అధిక రద్దీ

తక్షణ చర్యలపై హోంశాఖ సమీక్ష

**న్యూఢిల్లీ, డిసెంబర్ 15 (సమ సమాజం):** ఢిల్లీ ఎయిర్ పోర్టులో అధిక రద్దీపై అధికారులు అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా అధ్యక్షతన ఈ మీటింగ్ జరిగింది. గత కొన్ని రోజుల నుంచి ఢిల్లీ యిర్ పోర్టులో రద్దీ సమస్య ప్రయాణికులను వెంటాడుతోంది. చెక్ ఇన్ దగ్గర గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని సందర్భాల్లో ఫ్లైట్ కూడా మిస్ అయ్యామని ప్రయాణికులు చెబుతున్నారు. ఎయిర్ పోర్టు రద్దీపై వస్తున్న ఫిర్యాదులతో ఇప్పటికే కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఎయిర్ పోర్టులో తనిఖీలు నిర్వహించారు. రద్దీ సమస్యకు చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# సెస్ ఎన్నికల్లో విజయం సాధిస్తాం



- నిరంతర విద్యుత్ అందిస్తున్న ఘనత కెసిఆర్‌ది
- మోటర్లకు మీటర్లు పెడుతున్న నేత మోడీ
- ఎమ్మెల్యేలు రవిశంకర్, రసమయిల విమర్శలు

**సిరిసిల్ల, డిసెంబర్ 15 (సమ సమాజం):** జిల్లాలో జరుగుతున్న సహకార విద్యుత్ సరఫరా సంస్థ సెస్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యేలు రవి శంకర్, రసమయి బాల కిషన్ ధీమాను వ్యక్తం చేశారు. గురువారం సిరిసిల్లా లో మంత్రి కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ నాయకత్వంలో 15 డైరెక్టర్ స్థానాలను గెలుచుకుంటామని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు కొమ్ముకాస్తుందని విమర్శించారు. దేశంలో ఉత్పత్తి చేస్తున్న కరెంట్‌ను అంబానీ, అదానీలకు విక్రయించేవాళ్లు కావాలా, రైతులను కంటికి రెప్పలా కాపాడుకునే కేసీఆర్ కావాలా జిల్లా రైతాంగం ఆలోచించుకోవాలని కోరారు. గత పాలనలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రైతుల గోస, చేనేత కార్మికుల బాధలు తొలగి పోయాయని' వారు తెలిపారు. మిడ్ మానేరు వల్ల జిల్లా లోని అన్ని చెరువులు నిండి రైతులు పంటలు సమృద్ధిగా పండిస్తున్నారని తెలిపారు. రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వారు వెల్లడించారు. కరెంట్ సమస్యకు వ్యతి రేకంగా పుట్టింది గులాబీ జెండా అని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ నేనని వివరించారు. మోటార్‌ల వద్ద మీటర్లు పెట్టేందుకు నరేంద్ర మోదీ ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రైతులను ఆదుకునేందుకు రైతు బీమా ఇచ్చిన గొప్ప వ్యక్తి కేసీఆర్అని అన్నారు. సెస్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎందుకు పోటీ చేస్తున్నారో తెలియదని తెలిపారు. ఎన్నికల్లో బీజేపీ వారిని నమ్మవద్దని ఎమ్మెల్యేలు సూచించారు. 8 ఏళ్ల క్రితం రాష్ట్రంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండేదని..కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక 24 గంటల కరెంటు ఇచ్చిందని ఎమ్మెల్యే రవి శంకర్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు రవి శంకర్,రసమయి బాలకిషన్ మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ వచ్చాక రైతుల గోస, చేనేత కార్మికులు బాధలు తొలగిపోయాయని ఎమ్మెల్యే రవి శంకర్ అన్నారు. చేనేత కార్మికుల ఆకలి చావులు ఆగి పోయాయన్నారు..కేటీఆర్ నాయకత్వంలో 15 డైరెక్టర్ స్థానాలు గెలుచుకుంటమని.. సిరిసిల్ల జిల్లా సెస్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగుర వేస్తమని తెలిపారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్..రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉందన్నారు. రైతుకి బీఆర్ఎస్ కి చాలా సంబంధాలు ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. మోటార్ ల వద్ద మీటర్లు పెట్టేందుకు నరేంద్ర మోడీ చూస్తున్నారని రసమయి ఆరోపించారు. కరెంట్ ను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర

# ఇక దేశంలో బిఆర్ఎస్‌దే భవిష్యత్

పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పిన ఎమ్మెల్యే



**మహబూబాబాద్, డిసెంబర్ 15 (సమ సమాజం):** కాంగ్రెస్, బీజేపీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీలో సముచిత గౌరవం దక్కుతుందని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. బిఆర్ఎస్‌దే ఇక భవిష్యత్ అని అన్నారు. కెసిఆర్‌తో ఇక దేశ రాజకీయాలు మారనున్నాయని అన్నారు. గురువారం మహబూబాబాద్ నియోజకవర్గం గూడూరు మండలం లోని మర్రిమిట్టా గ్రామంలో బీజేపీ, కాంగ్రెస్, పార్టీలకు చెందిన వంద మంది నాయకులు, కార్యకర్తలు ఆయా పార్టీలకు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎమ్మెల్యే బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. గ్రామస్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని వెల్లడించారు. కొత్త ,పాత తేడా లేకుండా అందర్నీ గుండెల్లో నిలుపుకుంటానని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. గ్రామస్థాయిలో బీఆర్ఎస్ పటిష్టతకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తిలో నీటి వనరులు పుష్కలం

భారీగా పెరిగిన భూగర్భ జలాలు

అధికారులతో సమీక్షలో మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తిలో మంత్రి పర్యటన



**వనపర్తి, డిసెంబర్ 15 (సమ సమాజం):** వనపర్తి జిల్లాలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయని, రాష్ట్రంలోనే ఈ జిల్లా భూగర్భ జల లభ్యతలో మొదటిస్థానంలో నిలిచిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. వనపర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి నిరంజన్ రెడ్డి ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. నీటి పారుదల, వ్యవసాయ రంగాల అభివృద్ధిలో వనపర్తి జిల్లా చాలా ముందంజలో ఉందని తెలిపారు. గత వానాకాలం సీజన్లలో వర్షపాతం అధికంగా నమోదైందని గుర్తు చేశారు. పాలమూరు రంగారెడ్డి లెఫ్ట్ కెనాల్ -2, 3 కింద 52 వేల ఎకరాల ఆయకట్టు సాగు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలంపూర్ నియోజకవర్గంలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతున్నదని ఆయన వివరించారు. గోపాల్‌పేట, ఘనపూర్‌లలో 37 కిలో మీటర్ల మేర నీటి వనరులు వున్నట్లు నిరంజన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ అడ్వైజర్ విజయ్ ప్రకాష్, చీఫ్ ఇంజనీర్లు(సీఈ) హమీద్ ఖాన్, రఘునాథ్ రావు, ఎస్ఈటీ సత్యశిల రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) మధుసూదన్, అధికారులు, నీటి పారుదల శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# నేడు ఐఎస్‌బి 20ఏళ్ల వార్షికోత్సవం

## గెస్ట్‌గా పాల్గొంటున్న మాజీ సిఎం చంద్రబాబు

**హైదరాబాద్, డిసెంబర్ 15 (సమ సమాజం):** శుక్రవారం ఐఎస్‌బీ హైదరాబాద్ 20 ఏళ్ల ఆవిర్భావ వేడుకలను భారీగా చేపట్టనున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి ఎపి మాజీ సిఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఉత్సవాల్లో పాల్గొననున్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఐఎస్‌బీ ఆవిర్భావ ముగింపు వేడుకలు జరుగనున్నాయి. ఈ వేడుకలకు టీడీపీ అధినేత ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఇందులో భాగంగా ఐఎస్‌బీ విద్యార్థులతో చంద్రబాబు ముఖాముఖీ చర్చలో పాల్గొననున్నారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాడు హైదరాబాద్‌లో ఐఎస్‌బీ ఏర్పాటుకు చంద్రబాబు ఎంతగానో కృషి చేసిన విషయం తెలిసిందే. 2001లో నాటి ప్రధాన మంత్రి వాజ్‌పేయి చేతుల మీదుగా హైదరాబాద్ ఐఎస్‌బీ సంస్థ ప్రారంభమైంది. అనేక రాష్ట్రాలు పోటీ పడినా ప్రతిష్టాత్మక సంస్థను నాడు రాష్ట్రానికి తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కింది

# రాజును కాపాడిన రెస్క్యూ టీమ్

(మొదటి పేజి తరువాయి) గాయాలపాలైన రాజును ఆస్పత్రికి తరలించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సింగరాయిపల్లి శివారులో ఫారెస్ట్ ఏరియాలో వేటకు వెళ్లిన రాజు అనే వ్యక్తిని రక్షించారు. రాళ్ల గుట్టల సందుల్లో ఇరుక్కుపోయి నరకయాతన అనుభవించిన రాజు.. ఎట్టకేలకు ప్రాణంత బయటపడ్డాడు. దాదాపు 43 గంటలకు పైగా రాళ్ల మధ్యలోనే ఉండిపోయిన రాజును బయటకు తీశారు. బాధితుడిని రక్షించేందుకు రెస్క్యూ ఆపరేషన్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వివిధ శాఖ అధికారులు.. సమన్వయంతో పని చేసి, రాజు ప్రాణాన్ని కాపాడారు. రాజును కాపాడేందుకు పోలీసులు అన్ని ప్రయత్నాలు చేశారు. లెటెస్ట్ టెక్నాలజీ సాయంతో బండ రాళ్లను బ్లాస్ట్ చేశారు. చివరి రెస్క్యూ ఆపరేషన్ సక్సెస్ కావడంతో కుటుంబ సభ్యులతో పాటు అధికారులందరూ ఊపిరి పీల్చుకున్నారు. తాము పడ్డ కష్టం ఫలించిందని సంతోషం వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతంలో షికారుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రాళ్లగుట్టల సందుల్లో ఇరుక్కుపోయిన రాజు అనే వ్యక్తిని రక్షించేందుకు పోలీసులు, రెస్క్యూ టీమ్ విపరీతంగా శ్రమిస్తోంది. అతడికి అడ్డుగా ఉన్న బండరాళ్లను తొలగించారు. అయితే తల ఇరుక్కుపోవడంతో ఇప్పుడు పోలీసులు తలలు పట్టుకున్నారు. రెండు పెద్ద బండరాళ్ల మధ్య ఉన్న సొరికెలో అతను తలతో ఇరుక్కుపోయాడు. 40గంటలు..రాజు బండరాళ్ల మధ్య గుహలో ఇరుక్కుపోయి 43 గంటలు గడుస్తోంది. తలకిందులుగా చిక్కుకుపోయి ఉక్కిరి బిక్కిరవుయ్యాడు. బయటకు రాలేక నరకయాతన అనుభవించాడు. 40గంటలుగా నీళ్లు లేవు, ఆహారం లేదు. తనని కాపాడాలంటూ బాధితుడు వేడుకున్నాడు.. కామారెడ్డి.. సింగరాయిపల్లి గుహ లోపల బండరాళ్ల మధ్య చిక్కుకొని నరకయాతన అనుభవించాడు. బయటకు కాళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. పక్కనున్న బండరాళ్లను తొలగించి రాజును క్షేమంగా బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు కొనసాగాయి. గుహ దగ్గర రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగించి సఫలం అయ్యారు. డ్రిల్లింగ్ మిషన్ల సాయంతో బండరాళ్లను తొలగించడంతో పని సులువు అయ్యింది. బాధితుడికి ఆక్సిజన్, ఫ్లూయిడ్స్ పంపించి కాపాడుతూ వచ్చారు. అలా రాజును బయటకు తీసుకొచ్చేందుకు అధికారులు ప్రయత్నించారు. కొబ్బరినూనెను సైతం వినియోగించారు. బండరాళ్లను పేల్చివేస్తూ.. కాపాడేందుకు దాదాపు 50 మందికి పైగా సిబ్బంది రెస్క్యూ నిర్వహించారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామానికి చెందిన రాజు మంగళవారం వేటకు వెళ్లి గుహలో ఇరుక్కుపోయాడు. కింద పడిపోయిన ఫోన్ తీసేందుకు యత్నించి మరింత లోతుకు వెళ్లిపోయాడు. ఎంత ప్రయత్నించినా రాజు బయటకు రాలేకపోయాడు. తనను కాపాడాలంటూ అరుపులు కేకలు వేశాడు. రాజు అరుపులు విన్న కొందరు స్థానికులు..అతన్ని బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని రాజును రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. జేసీబీల సాయంతో రాళ్లను తొలగిస్తున్నారు. పెద్ద పెద్ద రాళ్లను పేల్చివేసారు. తన కొడుకును తొందరగా బయటకు తీసుకురావాలని రాజు తల్లి వేడుకోవడం కంటతడిపెట్టించింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి గుట్ట దగ్గరకే కుటుంబసభ్యులు ఉంటున్నారు. రాజును ఎప్పుడూ బయటకు వస్తాడా? అని ఎదురు



చూస్తున్నారు. రాజు బయటకు రాకపోవడంతో నిన్న అతని స్నేహితుడు అశోక్ గుహలోకి దిగాడు. మధ్యలో దాకా వెళ్లే ధైర్యం చెప్పి వచ్చాడు.బ్లాస్ట్ చేసినా రాజుకు ప్రమాదం లేకుండా చర్యలు తీసుకున్నామని పోలీసులు తెలిపారు. మరోవైపు అతనికి ఫ్లూయిడ్స్ కూడా అందిస్తూ ధైర్యం చెబుతున్నా మని డాక్టర్ తెలిపారు. రామారెడ్డి మండలం రెడ్డిపేటకు చెందిన చాడ రాజు తరచూ షికారుకు వెళుంటాడు. ఉడుములు, ఇతర చిన్నపాటి జంతువులను పట్టు కునేందుకు ప్రయత్నిస్తుంటాడు. మంగళవారం మధ్యాహ్నం రాజు షికారుకంటూ వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాలేదు. దాంతో కుటుంబ సభ్యులు బుధవారం మధ్యాహ్నం అతడిని వెతుక్కుంటూ అడవిలోకిలోపలికి వెళ్లారు. తరచూ అతను తిరిగే ప్రాంతాల్లో గాలించారు. సింగరాయిపల్లి శివారులోని పెద్ద రాళ్ల గుట్ట మధ్యలో నుంచి అరుపులు వినిపించడంతో అక్కడకు వెళ్లారు. లోపలి నుంచి అరుస్తున్న వ్యక్తిని రాజుగా గుర్తించారు. రాళ్ల మధ్య సందులో ఇరుక్కుపోగా.. బయటకు కేవలం కాళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. బయటకు తీసేందుకు కుటుంబీకులు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. తాగేందుకు పైనుంచి నీళ్లు పోశారు. ఘటనా స్థలానికి పోలీస్, రెవెన్యూ, ఫారెస్ట్, ఫైర ఆఫీసర్లు, సిబ్బంది చేరుకున్నారు. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. రాళ్లగుట్ట పక్కన జేసీబీతో తవ్వుతున్నారు. రెండు బండరాళ్ల మధ్య ఇరుక్కు పోవడంతో అతడు బయటకు రాలేని పరిస్థితిలో ఉన్నాడని అధికారులు తెలిపారు. భారీ క్రేన్ సహాయంతో చుట్టుపక్కల సమాంతరంగా తవ్వకాలు చేపట్టామన్నారు. కామారెడ్డి ఏఎస్పీ అన్యోన్య, డీఎస్పీ సోమనాథ్.. సహాయకచర్యలను పర్యవేక్షించారు.

# నకిలీ సర్టిఫికెట్ల ముఠా అరెస్ట్

(మొదటి పేజి తరువాయి) చేస్తున్న నాలుగు ముఠా సభ్యులను అరెస్టు చేశామన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు డీసీపీ రాజేష్ చంద్ర తెలిపారు. కొంతమంది యూనివర్సిటీ కంప్యూటర్ ఆపరేటర్స్?తో కుమ్మకై ఈ దందా చెలామణి చేస్తున్నారని వెల్లడించారు. ఎవరికైతే నకిలీ సెర్టిఫికెట్ అవసరం ఉన్నదో వాళ్ళను ఆసరా చేసుకుని.. ఈ రాకెట్ టీమ్ చెలామణి అవుతోందన్నారు. నిందితులపై హైదరాబాద్‌లోని పలు పోలీసుస్టేషన్‌లలో చీటింగ్ కేసులు నమోదయ్యాయయని డీసీపీ రాజేష్ చంద్ర చెప్పారు. అన్నా యూనివర్సిటీతో గో డాడీ వెబ్ సైట్ల ద్వారా నకిలీ సర్టిఫికెట్ సృష్టిస్తున్నారని అన్నారు. ప్రజలెవరూ ఇలాంటి నకిలీ సర్టిఫికెట్స్?కు ప్రలోభ పడవద్దని డీసీపీ రాజేష్ చంద్ర కోరారు. నకిలీ సెర్టిఫికెట్స్ ద్వారా ఎలాంటి ఉద్యోగం పొందినా.. తరువాత అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఒక్కొక్క సెర్టిఫికెట్‌కు నిందితులు రూ.50వేల నుంచి 1లక్ష వరకు వసూలు చేస్తున్నారని అన్నారు. నిందితులు మొహమ్మద్ ఏతేషాం, ఉద్దిన ఉసేన్, మొహమ్మద్ అబ్దుల్ ఖాదర్, మొహమ్మద్ అల్తాఫ్ అహ్మద్, మొహమ్మద్ ఇమ్రాన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చేపట్టామని డీసీపీ రాజేష్ చంద్ర తెలిపారు.

# బిఆర్ఎస్‌కు విఆర్ఎస్ తప్పదు

(మొదటి పేజి తరువాయి) ఎన్నికల్లో తాను ఓడిపోతే కార్యకర్తలు ఏడ్చారని.. దానిపై దేశం అంతా చర్చ జరిగిందన్నారు. కరీంనగర్ గడ్డ బీజేపీ అడ్డా అని..కార్యకర్తల కష్టం వల్లే తాను గెలిచానని చెప్పారు. అవమానాలకు తాను భయపడనని చెప్పారు. కరీంనగర్ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని స్పష్టం చేశారు. పింక్ జెండాతో అపవిత్రమైన తెలంగాణను కాషాయ జెండాతో పవిత్రం చేయమని జాతీయ నాయకత్వం సూచించిందని తెలిపారు. పింక్ జెండాతో అపవిత్రమైన తెలంగాణను కాషాయ జెండాతో పవిత్రం చేయమని జాతీయ నాయకత్వం సూచించిందని తెలిపారు. అందుకే ప్రజాసంగ్రామ యాత్ర చేపట్టినట్లు తెలిపారు.



కరీంనగర్ గడ్డ తనకెంతో ఇచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. హిందూ ధర్మ రక్షణ కోసం నిరంతరం పనిచేస్తానని తెలిపారు. కరీంనగర్ లో జరుగుతున్న ప్రజాసంగ్రామయాత్ర ముగింపుసభలో ఆయన భావోద్వేగంతో మాట్లాడారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఓడిపోతే కార్యకర్తలు ఏడ్చారని..దానిపై దేశం అంతా చర్చ జరిగిందన్నారు. కరీంనగర్ గడ్డ బీజేపీ అడ్డా అని..కార్యకర్తల కష్టం వల్లే తాను గెలిచానని చెప్పారు. అవమానాలకు తాను భయపడనని చెప్పారు. కరీంనగర్ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని స్పష్టం చేశారు. కరీంనగర్ పార్లమెంటరీ పరిధిలో బండి సంజయ్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ తెలిపారు. కరోనా సమయంలో ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్స్, వైద్య పరికరాల కోసం 3కోట్లు అందజేశారన్నారు. కరీంనగర్ పార్లమెంటరీలో జాతీయ రహదారుల నిర్మాణానికి 5వేల 751 కోట్ల నిధులు తీసుకొచ్చారని తెలిపారు. సీఆర్ఐఎఫ్ ద్వారా 216 కోట్లతో పాటు 30 కోట్లతో గ్రామీణ రహదారులను అభివృద్ధి చేశారన్నారు. కరీనంగర్ చొప్పదండి మార్గంలో రైల్వేగేట్ వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జికు కేంద్రం నుంచి 100 కోట్లు తీసుకొచ్చారని చెప్పారు. ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజీకి అటానమస్ హోదా తీసుకొచ్చినట్లు తెలిపారు. రుక్మాపూర్‌లో సైనిక స్కూల్ ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. పాఠశాలల్లో భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కోసం సర్వశిక్షఅభియాన్ కింద 46 కోట్లు తీసుకొచ్చారన్నారు. మధ్యాహ్న భోజనం పథకం కోసం 19కోట్ల నిధులు, ఉపాధిహామి కోసం 612 కోట్ల నిధులు కేంద్రం నుంచి తీసుకొచ్చారని తెలిపారు. ఎన్నికల కంటే ముందే టీఆర్ఎస్ ఖతమైందని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. హామీల అమల్లో కేసీఆర్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. బీజేపీకి, మోడీకి వ్యతిరేకంగా కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని పెట్టారన్నారు. బీఆర్ఎస్ కు సిద్ధాంతం, ఎజెండా అంటూ ఏమీ లేదని, కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకునేందుకే బీఆర్ఎస్ ఏర్పాటని ఆరోపించారు. ఈ విషయం కార్యకర్తలకు తెలిసింది కానీ.. నాయకులే మేల్కోవాలన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఇక కెసిఆర్ పనిచేయబోతున్నారని అన్నారు. బీఆర్ఎస్ తో కేసీఆర్... దేశమంతా తిరుగుతూ కేటీఆర్ కు రాష్ట్రం అప్పగిస్తాడట.. సినీ నటులతో, రాత్రి మ్యూజిక్ లు వినడం తప్ప కేటీఆర్ ప్రజల్లోకి రాడని అరవింద్ అన్నారు. ఇక మొన్నటి దాకా తనని వేటాడి, వెంటాడ ఓడిస్తానన్న కవిత.. ఇప్పుడు తన తండ్రి చెప్పిన చోట పోటీ చేస్తుందట.. కవిత తన మీద పోటీ చేయాలని, ధైర్యం లేకపోతే కేసీఆర్ ను ఇందూరు నుంచి పోటీకి దిగామని చెప్పాలని అరవింద్ డిమాండ్ చేశారు. బీజేపీ వస్తేనే అవినీతి రహిత పాలన వస్తుందని, డబుల్ ఇంజన్ సర్కారు లక్ష్యంగా పని చేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. బీసీలు ఆర్థికంగా ఎదిగితే తన మాట వినరని సీఎం కేసీఆర్ అనుకుంటున్నారని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ వ్యాఖ్యానించారు. నిధులు ఇవ్వకపోయినా బీసీలు ఓటు వేస్తారనే ధీమాలో కేసీఆర్ ఉన్నారని..బీసీల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్లో కేసీఆర్ కేటాయించింది కేవలం రూ.239 కోట్లేనని గుర్తు చేశారు. ఇటువంటి దురుద్దేశంతో ఉన్న కేసీఆర్ కు బీసీలు ఓటు ఎందుకు వేయాలని ప్రశ్నించారు. కరీంనగర్ లో ప్రజా సంగ్రామ యాత్ర ముగింపు సభలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఓట్ల కోసం వెళ్తే పాత హామీలపై ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతోనే.. తన పార్టీ పేరును బీఆర్ఎస్ గా కేసీఆర్ మార్చుకున్నారని తెలిపారు. ఒకవేళ ప్రజలు గత హామీల గురించి అడిగితే.. రద్దయిపోయిన టీఆర్ఎస్ పార్టీనే ఆ హామీలు అడగాలని, తమను అడగొద్దని కేసీఆర్ చెబుతారని పేర్కొన్నారు. కోటి ఓట్లు... 90 సీట్లు.. ప్రగతి భవన్ లో బీజేపీ స్లాటు నినాదంతో పార్టీ శ్రేణులు ముందుకు పోవాలన్నారు. ‘ అందరి తెలంగాణ.. అభివృద్ధి తెలంగాణ.. ఆత్మ గౌరవ తెలంగాణ కోసం మేం ఆనాడు తెలంగాణ ఉద్యమం చేశాం.కానీ ఇప్పుడు కేసీఆర్ సర్కారు బీసీలను విస్మరిస్తుంటే బాధేస్తోంది. కుల వృత్తులంటే కేసీఆర్ కు ఎందుకంత వివక్ష... రాష్ట్రంలో కుల వృత్తులపై ఆధారపడి 6 లక్షల కుటుంబాలు నడుస్తున్నాయి.. వారిని ఆదుకునే కార్పొరేషన్ పెట్టాలనే సోయి కూడా కేసీఆర్ కు లేదు‘ అని బూర నర్సయ్య గౌడ్ చెప్పారు. రాష్ట్ర ప్రజలను అడుక్కునే స్థితిలో ఉంచాలనే దుర్బుద్ధితో కేసీఆర్ ఉన్నారని కామెంట్ చేశారు. మోడీ వ్యాక్సిన్ తోనే దేశానికి బీఆర్ఎస్ పీడ విరగడ అవుతుందన్నారు. బండి సంజయ్ 5వ విడత ప్రజాసంగ్రామ యాత్ర ముగిసింది. కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కాలేజీలో ముగింపు సభ ఏర్పాటు చేయగా..ప్రజలు, పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా,తరుణ్ చుగ్ తదితరులు హాజరయ్యారు. మరోవైపు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి, ఎంపి అరవింద్, జాతీయనేత మురళీధర్ రావు,ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బూర నర్సయ్య గౌడ్ సహా మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర బీజేపీ ముఖ్య నేతలు హాజరయ్యారు. నవంబర్ 28న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పాదయాత్ర ప్రారంభమైంది. ఐదు జిల్లాలు, 3 పార్లమెంట్ నియోజకవర్గాలు, 8 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా ఈ యాత్ర సాగింది. గత నాలుగు విడతల్లో 21 జిల్లాల్లోని 13 లోక్ సభ, 48 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,178 కిలో మీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. బండి సంజయ్ నాల్గో విడత పాదయాత్రను కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ప్రారంభించారు. హైదరాబాద్ శివారులోని 9 నియోజకవర్గాలను కవర్ చేస్తూ 10 రోజుల పాటు పాదయాత్ర కొనసాగింది. ఇదే సమయంలో మునుగోడు ఉప ఎన్నిక షెడ్యూల్ రావడంతో ఐదో విడత ప్రజాసంగ్రామ యాత్ర ఆలస్యమైంది.

# 26నుంచి రాష్ట్రపతి దక్షిణాది విడిది

(మొదటి పేజి తరువాయి) సందర్శించి.. రాష్ట్రపతి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ప్రసాద్ ప్రాజెక్టును ఈ సందర్భంగా ఆమె ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల వరకు వరంగల్ జిల్లాలోని రామప్ప ఆలయాన్ని సందర్శిస్తారు. అక్కడ సైతం ప్రశాద్ ప్రాజెక్టును ప్రారంభించడంతో పాటు కేంద్ర సాంస్కృతిక శాఖకి సంబంధించిన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు.

# నవీన్ రెడ్డి కస్టడీని కోరిన పోలీసులు

(మొదటి పేజి తరువాయి) స్టేట్‌మెంట్‌లో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రేమ నిరాకరించినందునే వైశాలిని వేధించినట్లు నవీన్ రెడ్డి అంగీకరించాడు. వైశాలి స్నేహితురాలి ద్వారా తనకు ఆమె పరిచయమైందని నవీన్ పోలీసులకు చెప్పాడు. వైశాలితో కలిసి బ్యాడ్మింటన్ ఆడేవాడినని, ఆమెను పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రపోజల్ ను వైశాలి ముందు పెట్టానని అన్నాడు. ఆమె తన ప్రేమను నిరాకరించడంతో వైశాలి తండ్రికి విషయం చెప్పినా వారు కూడా అంగీకరించలేదని దీంతో ఆమెను ఎలాగైనా సొంతం చేసుకోవాలన్న ఉద్దేశంతో వేధింపులు మొదలుపెట్టానని నవీన్ రెడ్డి అంగీకరించినట్లు తెలుస్తోంది. ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ క్రియేట్ చేసి ఫొటోలు, వీడియోలు పెట్టడంతో పాటు ఆమె ఇంటి ముందు ల్యాండ్ తీసుకుని షెడ్ వేశానని నవీన్ రెడ్డి చెప్పాడు. వైశాలికి నిశ్చితార్థం జరుగుతుందని తెలుసుకున్న తాను తన వద్ద పని చేసే వారందరిని తీసుకెళ్లి ఆమె కుటుంబసభ్యులపై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేసినట్లు అంగీకరించాడు. వైశాలిని కిడ్నాప్ చేసి కారులో ఆమెను చిత్రహింసలు పెట్టినట్లు చెప్పాడు. పోలీసులు తన కోసం వెతుకుతున్న విషయం తెలిసి వైశాలిని క్షేమంగా ఆమె ఇంటి వద్ద వదిలి తాను గోవాకు పారిపోయినట్లు నవీన్ రెడ్డి వెల్లడించాడు. వైశాలిపై అమితమైన ప్రేమ ఉన్నందునే ఆమెను క్షేమంగా ఇంటికి పంపించినట్లు పోలీసులకు చెప్పాడు. యువతి కిడ్నాప్ కేసులో నిందితుల కస్టడీ పిటిషన్‌పై విచారణ జరిగింది. కిడ్నాప్ కేసుకు సంబంధించిన కీలక సమాచారాన్ని నిందితుల నుంచి రాబట్టాల్సి ఉందని పోలీసులు తమ కస్టడీ పిటిషన్ లో పేర్కొన్నారు. నిందితుల నుంచి ప్రాసిక్యూషన్ కు సంబంధించిన వివరాలు రికార్డ్ చేయాల్సి ఉందని కోర్టుకు వివరించారు. నాగారం భానుప్రకాశ్ (20), రాథోడ్ సాయినాథ్ (22), గానోజి ప్రసాద్ (25), కోతి హరి (30), బోని విశ్వేశ్వర్‌రావు (26)లను కస్టడీకి అప్పగించాలని కోరుతూ ఆదిభట్ల పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై ఇబ్రహీంపట్నం కోర్టులో విచారణ నిర్వహించారు.మరోవైపు ఈ కేసులో ప్రధాన నిందితుడు నవీన్‌రెడ్డి మంగళవారం గోవాలో పోలీసులకు చిక్కిన విషయం తెలిసిందే. అతడిని ఇప్పటికే హైదరాబాద్‌కు తీసుకొచ్చిన పోలీసులు..రాత్రి ఇబ్రహీం పట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం నవీన్‌రెడ్డిని ఇబ్రహీంపట్నం కోర్టులో ప్రవేశపెట్టారు. అయితే నవీన్ రెడ్డిని మెజిస్ట్రేట్ ఎదుట ప్రవేశపెట్టేందుకు తీసుకెళ్లే క్రమంలో..అతడు మాస్క్ తీసేసి మీడియాతో మాట్లాడే ప్రయత్నం చేశాడు. అయామ్ నాట్ సేఫ్ అంటూ నవీన్ అరిచాడు. నేను ఒక గంట మాట్లాడిన వీడియోను రిలీజ్ చేస్తే పోలీసులు మాత్రం కొద్దిగానే విడుదల చేశారని కామెంట్ చేశాడు. ఆ కొద్దిపాటి వీడియోను చూపించి నేను తప్పు ఒప్పుకున్నట్లు చిత్రీకరించారని అరుస్తూ చెప్పాడు. ఈ కేసులో రుమాన్, పవన్ ఇంకా పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. వారికోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.


# లాడెన్‌కు ఆశ్రయమిచ్చే వారికి మాట్లాడే హక్కు లేదు

(మొదటి పేజి తరువాయి)వ్యక్తం చేశారు. ఉగ్రవాదానికి ఊతమిచ్చేవారిని రక్షించడానికి అంతర్జాతీయ వేదికలను కొన్ని దేశాలు దుర్వినియోగం చేస్తున్నాయని పరోక్షంగా చైనా, పాకిస్థాన్‌లపై జైశంకర్ ఘాటు విమర్శలు చేశారు. ఐక్య రాజ్యసమితి భద్రతా మండలిలో పాక్ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తింది. దీనికి భారత్ గట్టిగా బదులిచ్చింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో కాశ్మీర్ అంశాన్ని లేవనెత్తిన పాకిస్థాన్‌పై భారత్ బుధవారం ధీటుగా స్పందించింది. ఒసామా బిన్‌లాడెన్ లాంటి ఉగ్రవాదికి ఆశ్రయం కల్పించిన దేశానికి, పొరుగు దేశం పార్లమెంటుపై దాడికి పాల్పడిన వారికి యుఎన్ ప్రపంచవేదికపై నీతులు చెప్పే అర్హత లేదని పేర్కొంది. ఐరాస భద్రతా మండలి చర్చా కార్యక్రమంలో పాకిస్థాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో కాశ్మీర్ అంశాన్ని లేవనెత్తగా, భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ స్పందించారు. మహమ్మారి, పర్యావరణ మార్పు, వివాదాలు లేదా ఉగ్రవాదం వంటి కీలక సవాళ్లపై సమర్థవంతంగా స్పందిస్తేనే ఐరాసపై విశ్వసనీయత ఆధారపడి ఉంటుందన్నారు. బహుళ పాక్షిక సంస్కరణలపై చర్చించేందుకు జైశంకర్ ఐక్యరాజ్యసమితి కార్యాలయానికి చేరుకున్న సంగతి తెలిసిందే. బహుళ పాక్షికత ఆవశ్యకతపై దృష్టి పెడుతున్నామని, దీనిపై భారత్ ప్రత్యేక అభిప్రాయాలను కలిగి ఉందని అన్నారు. సమస్యలపై ఉత్తమ పరిష్కారం కోసం శోధిస్తున్నప్పుడు ఇటువంటి ముప్పులను సాధారణంగా తీసుకోకూడదని, ప్రపంచం మొత్తం ఆమోదించదని .. వాటిని సమర్థించాలనే ప్రశ్న తలెత్తకూడదని అన్నారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశాలకు ఇది వర్తిస్తుందని అన్నారు. పొరుగుదేశ పార్లమెంటుపై దాడి చేసిన దేశానికి యుఎన్‌లో ఇతరులకు బోధించే అర్హత లేదని అన్నారు. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు భారత్ అంతర్గత వ్యవహారమని అన్నారు. పాకిస్థాన్ అసత్య ప్రచారాలను ఇకనైనా ఆపాలని సూచించారు. ఉగ్రవాదం, శతృత్వం, హింసకు తావులేని వాతావరణంలో మాత్రమే తాము ఇస్లామాబాద్‌తో సంబంధాలను కోరుకుంటున్నామని భారత్ పేర్కొంది. బిన్ లాడెన్ లాంటి ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన వారికి.... భారత్



పార్లమెంట్ దాడికి పాల్పడిన వారికి యునైటెడ్ నేషన్స్ వంటి వేదికపై శాంతి వ్యాఖ్యలు బోధించే అర్హత లేదని జైశంకర్ చురక లంటించారు. ఉగ్రవాద నిర్మూలనకు అనేక దేశాలు బాధ్యతగా వ్యవహరిస్తుంటే..కొన్ని దేశాలు మాత్రం ఉగ్రవాదులను సమర్ధించేలా.. వారిని రక్షించేలా ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయడం పూర్తిగా భారత అంతర్గత వ్యవహారమని జైశంకర్ అన్నారు. ఈ విషయాన్ని పాక్ అర్థం చేసుకుంటే మంచిదని సూచించారు. భారత్ పై వ్యతిరేక ప్రచారాన్ని ఆపాలని హితవు పలికారు. ఉగ్రవాదం, శత్రుత్వం, హింసకు తావులేని ఇస్లామాబాద్ తో సంబంధాలు కోరుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఉగ్రవాదులను బ్లాక్ లిస్టులో చేర్చాలనే ప్రతిపాదనకు చైనా వీటో అధికారంతో అడ్డుపడటంపై జై శంకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కరోనా, పర్యావరణ మార్పు, ఉగ్రవాదం వంటి వాటిపై ఐక్యరాజ్యసమితి స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలావుంటే ప్రపంచం ఎదుర్కొంటున్న హింస, సరిహద్దు ఘర్షణ వంటి అనేక సంక్షోభాలు సద్దుమణగడానికి మహాత్మ గాంధీ ఆచరించిన అహింస,శాంతి సిద్ధాంతలు దోహదం చేస్తాయని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ . జై శంకర్ అన్నారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ తో కలిసి ఎస్ జైశంకర్ ఆవిష్కరించారు. అహింస, శాంతి, నిజాయితీలకు ప్రతిరూపం గాంధీ మహాత్ముడు అని జై శంకర్ కొనియాడారు. ఐక్యరాజ్యసమితిలో ఆయన విగ్రహాన్ని నెలకొల్పడం ద్వారా గాంధీజీ పేర్కొన్న ఆదర్శాలను ఎప్పటికప్పుడు గుర్తు చేసుకొంటున్నట్లవుతుందని జైశంకర్ తెలిపారు. అటు సామ్రాజ్యవాదంపై మహాత్మా గాంధీకి ఉన్న వ్యతిరేకతే ఐక్య రాజ్య సమితికి పునాది అని గుటెరస్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి. ప్రస్తుతం అక్కడ నెలకొల్పిన విగ్రహాన్ని .. ప్రముఖ భారతీయ శిల్పి, పద్మశ్రీ అవార్డు గ్రహీత రామ్ సుతార్ రూపొందించారు. దీనిని భారతదేశం ఐక్యరాజ్యసమితికి బహుమతిగా పంపింది.

# ఫామ్‌హౌజ్ కేసులో విచారణ



(మొదటి పేజి తరువాయి) నుంచి నమోదైన పీసీ యాక్ట్ కేసులన్నీ ఏసీబీనే విచారించాలని పిటిషనర్ వాదించారు. అన్ని అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని శుక్రవారం తుది వాదనలు వింటామని హైకోర్టు స్పష్టం చేసింది.




# చలన చిత్రం

## వీరసింహారెడ్డి నుంచి సుగుణసుందరి పాట విడుదల



నందమూరి బాలకృష్ణ అభిమానులు ఎంతో ఆతృతంగా ఎదురుచూస్తున్న చిత్రం వీరసింహారెడ్డి సినిమా నుంచి సుగుణ సుందరి ఫుల్ లిరికల్ వీడియో సాంగ్ వచ్చేసింది. బాలకృష్ణ, శృతిహాసన్ మధ్య వచ్చే ఈ డ్యుయెట్ సాంగ్ టర్కీలోని అందమైన లొకేషన్లలో స్టైలిష్‌గా సాగుతూ అభిమానుల్లో ఫుల్ జోష్ నింపుతోంది. శేఖర్ మాస్టర్ కంపోజ్ చేసిన స్టెప్పులను బాలకృష్ణ తనదైన స్టైల్‌లో వేస్తూ ఔరా అనిపిస్తున్నాడు. రామజోగయ్యశాస్త్రి రాసిన ఈ పాటను రామ్ మిర్యాల, స్నిగ్ధ శర్మ పాడారు. ఎస్ థమన్ అందించిన మ్యూజిక్ అందరినీ ఆకట్టుకునేలా సాగుతుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజైన జై బాలయ్య మాస్ ఆంథెమ్ సాంగ్ నెట్టింట వ్యూస్ పంట పండిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నాడు. వీరసింహారెడ్డి జనవరి 12న గ్రాండ్‌గా రిలీజ్ కాబోతుంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో శృతిహాసన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. వరలక్ష్మి శరత్‌కుమార్, హనీ రోజ్, చంద్రికా రవి, పీ రవిశంకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ధునియా విజయ్ విలన్‌గా నటిస్తున్నాడు.




## 18 పేజెస్ చిత్ర ట్రైటర్ 17న విడుదల

తెలుగు మూవీ లవర్స్ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటి 18 పేజెస్. నిఖిల్ సిద్దార్థ , అనుపమ పరమేశ్వరన్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. పల్నాటి సూర్యప్రతాప్ డైరెక్ట్ చేస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్ టైనర్ డిసెంబర్ 23న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో నిఖిల్, అనుపమ ట్రైలర్ 17న రాబోతున్నట్టు పుస్తకంలోని పేజీపై డిస్‌ప్లే చేస్తూ సరికొత్తగా ప్రకటించారు. 18 పేజెస్ చిత్రానికి గోపీసుందర్ సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే 18 పేజెస్‌లో కోలీవుడ్ స్టార్ హీరో శింబు పాడిన టైం ఇవ్వు పిల్లా సాంగ్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ మూవీ పోస్ట్ థియాట్రికల్ రైట్స్ ఫ్యాన్సీ ధరకు అమ్ముడుపోయినట్టు సమాచారం. 18 పేజెస్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్ ను నెట్‌ఫ్లిక్స్, ఆహా.. శాటిలైట్ రైట్స్ ను జీ ఛానల్ దక్కించుకున్నట్టు ఇన్‌సైడ్ టాక్. ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ 2-సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై సంయుక్త నిర్మాణంలో బన్నీవాసు తెరకెక్కిస్తున్నారు. 18 పేజెస్ చిత్రానికి స్టార్ డైరెక్టర్ సుకుమార్ స్టోరీనందిస్తున్నాడు.




## బన్నీకి మ్యాగజైన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు

ఐకాన్ స్టార్ అల్లుఅర్జున్‌కి అరుదైన గౌరవం దక్కింది. స్టైలిష్ స్టార్‌కు జి క్యూ మెన్ మ్యాగజైన్ 2022 ఆఫ్ ది ఇయర్ పురస్కారం లభించింది. స్వయంగా ఈ బృందం హైదరాబాద్ వచ్చి అల్లుఅర్జున్ కి అందజేశారు. లీడింగ్ మాన్ టైటిల్‌తో బన్నీని గౌరవించింది. ఫలక్ నుమా ప్యాలెస్‌లో ప్రత్యేకమైన పార్టీ నిర్వహించి ఈ అవార్డుని బన్నీకి ఇచ్చినట్లుగా తెలుస్తోంది. అల్లు అర్జున్ పుష్పది రైజ్ సినిమా చేసినప్పటి నుండి ఆయన కెరియర్ అనూహ్య మలుపు తిరిగింది. పుష్ప సినిమా కారణంగా పాన్ ఇండియా హీరోగా బన్నీకి గుర్తింపు వచ్చింది. దాని కంటే ముందు కూడా జాతీయంగా బన్నీకి మంచి క్రేజ్ ఉంది. పుష్ప సినిమా కారణంగా ఆయన క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. ఇక రష్యాల్లో విడుదలైన పుష్ప సినిమా ఇటీవల ఫిలింఫేర్ సౌత్ లో చాలా పురస్కారాలను అందుకుంది. బన్నీకి ఉత్తమ నటుడిగా అవార్డు వచ్చింది. ఇక పుష్ప ది రైజ్ బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో పుష్ప ద రూల్ సినిమా విషయంలో నిర్మాతలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## అవతార్ అద్భుతమంటూ ఓం రౌత్ కామెంట్స్

ఆదిపురుష్‌ను దృష్టిలో పెట్టుకుని నెటిజన్ల ట్రోల్



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 'అవతార్' మేనియా నడుస్తోంది. 13 ఏళ్ల క్రితం జేమ్స్ కామెరూన్ క్రియేట్ చేసిన ఈ అద్భుతానికి సీక్వెల్‌గా 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' వస్తోంది. డిసెంబర్ 16న అంటే శుక్రవారం విడుదల కానున్న ఈ మూవీకి సంబంధించిన వరల్డ్ వైడ్ ప్రత్యేక స్క్రీనింగ్స్ జరుగతున్నాయి. ఈ సినిమా ప్రత్యేక పదర్శన తాజాగా ముంబైలో కూడా జరిగింది. దీనికి అక్షయ్ కుమార్, వరుణ్ ధావన్, బాబీ డియోల్, కార్తీక్ ఆర్యన్, ఓం రౌత్ వంటి బాలీవుడ్ ప్రముఖులు హాజరయ్యారు. అనంతరం వీరందరూ ఈ సినిమా గురించి రివ్యూ చెప్పారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం యూట్యూబ్‌లో ట్రెండింగ్ అవుతోంది. అందులో 'ఆదిపురుష్' దర్శకుడు ఓం రౌత్ మాట్లాడుతూ.. 'ఈ చిత్రాన్ని ఐమాక్స్ 3డీ లో చూడటం ఒక అద్భుతమైన అనుభవంగా భావిస్తున్నాను' అని చెప్పుకొచ్చాడు. ఇది చూసిన పలువురు నెటిజన్లు అవతార్‌ని ప్రశంసించిన ఓం రౌత్‌ను ట్రోల్ చేయడం ప్రారంభించారు. 'ఓం రౌత్ విజువల్స్ మైండ్ బ్లోయింగ్ అని చెప్పడం చూస్తే నాకు ఏడుపు వస్తుంది' అని ఒకరు.. ఓం ప్రత్యేకంగా '3డి' అనే పదాన్ని నొక్కి చెప్పడం నాకు నవ్వు తెప్పించింది. '3డి'లో చూడటానికి ప్రత్యేకంగా తీసిన సినిమా అంటే ఏమిటో అతను తెలుసుకున్నట్లు కనిపిస్తోంది' అని ఇంకొకరు.. ఈ మాస్టర్‌పీస్‌ని చూస్తే.. అతను మరో 3 సంవత్సరాల పాటు అంటే 2026 తర్వాత 'ఆదిపురుష్' విడుదల చేస్తాడు' అని మరొకరు.. 'ఓం రౌత్ నిజమైన 3డీ చిత్రాన్ని చూస్తున్నాడు. ఇప్పటికైనా అతను ఏం తీశాడో తెలుసుకుంటానడని అనుకుంటున్నా' అని వేరొకరు రాసుకొచ్చారు. ప్రభాస్ హీరోగా ఓం రౌత్ దర్శకత్వం వహించిన 'ఆదిపురుష్' చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ని విడుదల చేసిన విషయం తెలిసిందే. అందులో వీఎఫ్ఎక్స్ చూసి చాలామంది నెటిజన్లు విపరీతంగా ట్రోల్ చేశారు. అలాగే.. యానిమేటేడ్ చిత్రంలా కనిపించడం, రావణుడికి స్పైక్స్ ఉండడం వంటి పలు అంశాలపై విమర్శలు గుప్పించారు. ఈ తరుణంలో ఆయన 'అవతార్ 2'ని ప్రశంసించడంతో పలువురు నెటిజన్లు స్పందిస్తూ ట్రోలింగ్ చేస్తున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in